# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


# యూరియా కొరత లేదు

**ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్**

**ఎరువులను ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని హెచ్చరిక**



ఎరువులను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేంద్రబోయి

**చిన్నచింతకుంట, అక్టోబరు 1 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఆగ్రో రైతు సేవా కేంద్రం2 ను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి బుధవారం తనిఖీ చేశారు. యూరియా, ఎరువుల స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. యూరియా పంపిణీ సక్రమంగా జరుగుతుందా లేదా అడిగి తెలుసుకున్నారు. రైతులకు యూరియా ఇబ్బంది లేకుండా సరఫరా చేయాలని సూచించారు. ఆగ్రో రైతు సేవా కేంద్రం ద్వారా యూరియా, ఎరువులు, విత్తనాలు, పురుగుమందులకు కచ్చితంగా ఎమ్మార్పీ ధరలకు ఇవ్వాలని, రైతులకు రసీదులు ఇవ్వాలని స్పష్టం చేశారు. యూరియా కొరత లేదని ఎప్పటికప్పుడు కొరత లేకుండా రైతులకు ఆగ్రోస్ కేంద్రాల ద్వారా అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్, మండల తహసిల్దార్ ఎల్లన్న, మండల వ్యవసాయ అధికారి రాజేష్ ఖన్నా తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

## ఎన్నికలకు సహకరించాలి

- ఎంపీటీసీ,జడ్పీటీసి, గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలు విజయవంతం చేయాలి
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ విజయేందిర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు1,ప్రభాతవార్త:** జిల్లాలో జరగబోయే ఎం.పి.టి.సి జడ్.పి.టి.సి గ్రామపంచాయతీ సర్పంచ్, ఎన్నికల నిర్వహణకు జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించి, సహకరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి కోరారు, బుధవారం కలెక్టరేట్ వి.సి.కాన్ఫరెన్స్ హాల్ లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే ఎన్నికలలో ప్రతి ఒక్కరూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, (ఎన్నికల నియమావళి) ని పాటిస్తూ ఎన్నికలు సజావుగా నిర్వహణకు సహకరించాలన్నారు, జిల్లాలో జడ్.పి.టి.సి, ఎం.పి.టి.సి,రెండు విడతల్లో,గ్రామ పంచాయతీ మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.ఎన్నికల నిబంధనలకు సంబంధించి తీసుకోవలసిన చర్యలు, నామినేషన్ల ప్రక్రియ, స్క్రూటినీ,ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థుల వ్యయ పరిమితి ఎన్నికలు నిబంధనలు తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ కు వివరించారు ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎస్ ఎస్ టి,లను నియమించినట్లు తెలిపారు ఎన్నికల కమిషన్ సూచించిన ప్రకారం జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జడ్.పి.సి.ఈ.ఓ,వెంకటరెడ్డి,డి.పి.ఓ పార్థ సారథి,ఆర్.డి.ఓ నవీన్,రాజకీయ పార్టీల ప్రతినిధుల పాల్గొన్నారు.



లక్ష్మమ్మ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న కేటీఆర్, చిత్రంలో మాజీ మంత్రులు

### మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డికి

## మాతృవియోగం

**లక్ష్మమ్మ పార్థివ దేహానికి ప్రముఖుల నివాళి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 1 ప్రభాతవార్త:** మాజీ మంత్రి, బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు డా.సి.లక్ష్మారెడ్డి మాతృమూర్తి చర్లకోల లక్ష్మమ్మ బుధవారం ఉదయం హైదరాబాద్ లోని వారి నివాసంలో స్వర్గస్తులయ్యారు. లక్ష్మమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి ప్రముఖులు నివాళులర్పించారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్రామ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మర్రి జనార్ధన్ రెడ్డి, జైపాల్ యాదవ్, రావుల చంద్రశేఖర్ రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డా.లక్ష్మారెడ్డికి, వారి కుటుంబ సభ్యులందరికీ కేటీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. లక్ష్మమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. వారివెంట కార్పొరేషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కోడ్గల్ యాదయ్య, ప్రణీల్‌చందర్, శ్రీకాంత్, కోట్ల ప్రశాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పదో రోజు ఐదో శక్తిపీఠం జోగులాంబ ఆలయంలో అమ్మవారు భక్తులకు జోగులాంబ అమ్మవారిగా దర్శమిచ్చారు.
( అలంపూర్ , అక్టోబర్ 1, ప్రభాతవార్త )

### విజయాల

# దశమి



- చెడుపై మంచి విజయం సాధించిన రోజు
- దేవదానవుల సంగ్రామంలో అమృతముద్భవించిన రోజు
- శమీవృక్షం నుంచి ఆయుధాలు స్వీకరించి విజయుడు విజయకేతనమెగరేసిన రోజు
- మహిషుని సంహరించి మహిషాసుర మర్ధినిగా అమ్మవారు దర్శనమిచ్చిన రోజు
- శ్రీరాముడు దుష్టరావుణుని సంహరించి దుష్టపీడను తొలగించిన రోజు
- విజయదశమి(దసరా) పండుగ నేడు

**భూత్పూర్,అక్టోబర్ 1,ప్రభాతవార్త :** హిందూవులు జరిపే అతి ముఖ్యమైన పర్వదినాలలో విజయదశమి(దసరా) పండుగ ప్రధానంగా అగ్రభాగంలో ఉంటుదని చెప్పవచ్చు.తెలుగు నూతన సంవత్సరాధి ఉగాది అయితే చెడుపై మంచి విజయం సాధించిన రోజుగా విజయదశమిని పేర్కొంటారు.పాలకడలిలో మేరుపర్వతానికి వాసుకి సర్పం తాడుగా చేసుకుని మేథోమథనం చేసిన దేవదానవుల భీకర సంగ్రామం ద్వారా ఉత్పన్నమైన అమృతం వెలువడిన పవిత్రమైన రోజుగా దసరా (విజయదశమి)ని చెప్పుకుంటారు.దుష్టుడైన రావణుడు తన దుష్టశక్తులతో ప్రజల్ని పీడిస్తూ,హింసించే దుష్టరావణుని మానవావతామెత్తిన భగవానుడు శ్రీరాముడు రావణుని సంహరించి దుష్టపీడన దూరం చేసిన రోజు విజయ దశమి.పాండవులు అజ్ఞాతవాసంలో విరాటరాజు కొలువులో మారువేషాలలో ఉంటూ ఉత్తరగోగ్రానంలో గోవుల్ని తస్కరిస్తున్న కౌరవుల మధమణిగించేందుకు శమీ వృక్షంపై దాచిన తమ ఆయుధాలను వెలికి తీసి ఉత్తరుని సారథ్యంలో అర్జునుడు తన గాండీవంతో కౌరవులను తుదముట్టించి చెడుపై విజయుడు విజయం సాధించిన రోజు కాబట్టి విజయ దశమిగా పిలుస్తారు.ఇక శరధృతువులో అమ్మలగన్న అమ్మ జగదాంబ పార్వతీదేవి దుష్ట రాక్షసుడైన మహిషుని తొమ్మిదిరోజుల పాటు పోరాడి పద్దెనిమి హస్తాలతో మహిషుని వధించి మహిషాసుర మర్ధినిగా పేరొందింది.అమ్మవారు శరధృతువులో తొమ్మిది రోజుల పాటు పోరాడి చెడుపై పోరాడి విజయం సాధించినందున శరధృతువులో తొమ్మిది రోజుల పాటు ఈ రాత్రులను శరన్నవరాత్రులని చెబుతుం టారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని తొమ్మిది రూపాలు,అవతారాల దర్శనమిస్తున్న అమ్మవారు జగన్మాతను కొలుస్తూ పదో రోజు విజయదశమిగా హిందూవులు పండుగ ఎంతో ఆనందోత్సవాల నడుమ జరుపుతారు.విజయ దశమి (దసరా) ప్రతీ ఏటా ఆశ్వీయుజ శుక్లపక్ష శుద్ధ దశమి రోజునజరుపుతారు.విజయదశమిని విజయాల పండుగగా పిలుస్తారు.అర్జునుడు ఇంద్రకీలాద్రి పర్వతంపై దేవతలలో అగ్రగణ్యుడైన ఇంద్రుడిని ఓడించి విజయుడిగా పేరొంది దుర్గా అమ్మవారి ఆశీస్సులు పొందాడట.అందుకే నాటి బెజవాడను నేడు విజయవాడగా పిలుస్తామని చెబుతారు.విజయదశమి పండుగ రోజున పిన్నలు,పెద్దలు,గృహిణులు పెందాడలనే లేచి తలంటు స్నానాలాచరించి,కొత్త దుస్తులు ధరించి ఇళ్లల్లో ప్రత్యేక పూజలు నిర్వహించుకుని దేవాలయాలను సందర్శించుకుని ఆయా దేవుళ్లకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహిస్తుంటారు. లేచిన వెంటనే అన్నిశుభాలకు శుభ సూచకంగా భావించే పాలపిట్టను దర్శించుకుం టారు.తీపి వంటకాలు,పిండివంటలు, కరకర లాడే గారెలు, బూరెలు,బొబ్బట్లు తయారు చేసి తమ కుటుంబసభ్యులతో పాటు బంధు,మి త్రులతో విందారగిస్తుంటారు.సాయం వేళ – మిగతా3లో..



సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

### గ్రామాల అభివృద్ధే

## ప్రభుత్వ ధ్యేయం

**రూ.8 కోట్ల రూపాయలతో నూతన సిసి రోడ్లు**

**ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్1 ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, అభివృద్ధికి ఎవరైనా అడ్డుపడితే ఉపేక్షించబోమని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్‌రెడ్డి అన్నారు. గడిచిన 20 నెలల్లోనే నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి 1000 కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. బుధవారం నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడలో రూ.2కోట్ల రూపాయలు, ఎండబెట్లలో రూ.2 కోట్లు, నాగనూలులో రూ.2 కోట్లు, దేశి ఇటిక్యాలలో రూ.2కోట్ల రూపాయలతో నూతనంగా మంజూరు చేసిన సీసీ రోడ్లు మరియు డ్రైనేజ్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి సీసీ రోడ్లు, అండర్ –మిగతా3లో..






## శ్రీశైలం డ్యాం..205టీఎంసీలు

- 10గేట్లు ఎత్తి సాగర్‌కు నీటివిడుదల
- 883.10 అడుగులకు చేరుకున్న నీటిమట్టం
- జూరాల 20గేట్లు ఎత్తి నీటివిడుదల



**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 1, ప్రభాతవార్త:** కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణానదీ పోటెత్తుతున్నది. దీంతో కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. శ్రీశైలం డ్యాం నిండుకుండలా మారింది. డ్యాం నీటిమట్టం 885అడుగు లకు గాను 883.20 అడు గులకు చేరింది. డ్యాం సామర్థ్యం 215.8070 టీఎంసీలకు 205.2258 టీఎంసీలకు చేరింది. జలా శయానికి జూరాల స్పిల్‌వే ద్వారా 3,22,360 క్యూసె క్కులు, సుంకేసుల నుంచి 24,567 క్యూసెక్కులు,హంద్రీ నుంచి 3750క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. శ్రీశైలం జలాశయంలోని ఎడమ,కుడి విద్యుదుత్పత్తి కేంద్రాలకు 65,151క్యూ సెక్కులు విడుదల చేశారు. డ్యాం 10గేట్లు ఎత్తి 389260క్యూసెక్కుల వరద దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం నుంచి మొత్తంగా 5,30,126 క్యూసెక్కుల వరద నాగార్జున సాగర్‌కు విడుదల అవుతున్నది. కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంల గేట్లు ఎత్తివేశారు. జూరాల ప్రాజెక్టుకు 357000ఇన్‌ఫ్లో నమోదు కాగా, 20గేట్లు ఎత్తి దిగువకు 3,23,360 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.727టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. అవుట్‌ఫ్లో 3,24,475క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది.

### సర్కారు భూమిలో..

## వెంచర్ రోడ్డు

**ఎకరా పొలం దర్జాగా కబ్జా**

**అధికారులు, ప్రజాప్రతినిధుల అండ ?**

**ప్రభుత్వ భూములను పట్టించుకోరా..**

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 1 ప్రభాతవార్త :** సర్కారు భూమిలోని నుంచి దర్జాగా ప్రైవేట్ వెంచర్ ఏర్పాటు చేసి రోడ్డు కూడా వేసి కమాన్ కట్టేసారు.. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బాలానగర్ మండలంలోని –మిగతా3లో..



ప్రభుత్వ భూమిలో వెంచర్ వేసిన దృశ్యం






## విజయదశమి విజయానికి, ధైర్యానికి ప్రతీక

**జిల్లా ప్రజలకు దసరా పండగ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ బాదావత్ సంతోష్**



జిల్లా కలెక్టర్ బాదావత్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 01 ప్రభాత వార్త:**విజయదశమి (దసరా) పండగ విజయాని కి, ధైర్యానికి ప్రతీక అని, ఎప్పటికైనా మంచికే విజ యం వరిస్తుందని తెలియజేసేందుకు ఈ పండగ నిదర్శనమని నాగర్‌కర్నూల్‌జిల్లా ఎన్నికల అధి కారి, కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. దస రా పండగ సందర్భంగా జిల్లా ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఆయన ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ విజయదశమి (దసరా) విజయం, ధైర్యంతో పాటు మంచితనానికి ప్రతీకగా పాండవులు వనవాసానికి వెళ్ళి విజయం సాధించినట్లుగా గతంలో పురాణాల్లో నిలవగా ప్రస్తుతం కూడా ఎప్పటికైనా మంచినే విజయం వరిస్తుందని తెలియజేస్తాం దని కలెక్టర్ సంతోష్ పేర్కొన్నారు. అలాగే దేవీశరన్నవరాత్రులను పురస్కరించుకొని దుర్గామాతకు పూజలు చేయడం, మాలాధారణ చేసిన భక్తులందరూ తొమ్మిది రోజుల పాటు ఎంతో నిష్టతో, భక్తితో ఆయా అలంకరణలతో ప్రతినిత్యం అమ్మవారిని కొలుస్తారని వారందరికీ మంచి జరగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. విజయదశమి రోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు జరగడంతో అవి భక్తులకు ఆధ్యాత్మికతను, ఆనందాన్ని, వారు చేసి పూజలకు ప్రతిఫలాన్ని ఇచ్చేలా దుర్గామాత ఆశీస్సులు ఉండాలని కోరారు. దసరా పండగను ఆనందంతో, ఉత్సాహంతో, సౌభాగ్యాన్ని పెంపొందించేవిధంగా జరుపుకోవాల న్నారు. ప్రతి కుటుంబం, గ్రామం, పట్టణాల్లో భక్తి, ఐకమత్యం, సంప్రదాయ విలువలతో పండగను చేసుకోవాలని కలెక్టర్ కోరారు.






## కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరిస్తాం

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు1, ప్రభాత వార్త :** అధికారంలోకి వచ్చేందుకు అమలుకు సాధ్యంకాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బుధవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బాకీ కార్డులను ఆయన విడుదల చేసారు. కాంగ్రెస్ మోసాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ బాకీ కార్డు ఉద్యమం ప్రారంభించిందని చెప్పారు. అభయహస్తం పేరిట కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజలు మరచిపోయారన్న భ్రమలో కాంగ్రెస్ నేతలు ఉన్నారని, వారి అబద్ధపు హామీలను అందరికీ గుర్తు చేసేందుకే బాకీ కార్డు ఉద్యమాన్ని చేపట్టామన్నారు. ఎన్నికలు ఏవైనా విజయం బీఆర్ఎస్ పార్టీదేనని ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ బావుల వద్ద మీటర్లు పెట్టేందుకు సిద్ధం ఐతుంది.. కరెంటు చార్జీలు కూడా పెంచాబోతున్నారు.



బాకీ కార్డును విడుదల చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

రైతులకు యూరియా ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం పండించిన పంట కొనుగోలు చేసేందుకు కూడా అవసరమైనా ఏర్పాట్లు చేయడం లేదన్నారు. ప్రతి మహిళకు గృహలక్ష్మి కింద రూ.2500 ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ లెక్కన చూసుకుంటే ఇప్పటివరకు రాష్ట్రంలోని ప్రతి మహిళకు 55వేల రూపాయలు ప్రభుత్వం బాకీ

### బాకీ కార్డు విడుదల చేసిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పడిందన్నారు. వృద్ధాప్య పింఛన్ ను నాలుగు వేలకు పెంచుతామని హామీ ఇచ్చిన ప్రభుత్వం 22 నెలల కాలంలో ప్రతి వృద్ధుడికి 44 వేల రూపాయలు బాకీ పడిందన్నారు. దివంగుల పెన్షన్ ను 6000 కు పెంచుతామన్న ప్రభుత్వం ఇప్పటివరకు 44 వేల రూపాయలు ప్రతి దివ్యాంగుడికి బాకీ పడిందన్నారు. షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి పథకానికి తులం బంగారం అదనంగా ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పటికీ లక్షలాదిమంది ఆడపడుచులకు బంగారం బాకీ పడిందన్నారు. రైతు భరోసా కింద ప్రతి రైతుకు 76 వేల రూపాయల బాకీ పడిందన్నారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి ఇస్తామన్న ప్రభుత్వం ప్రతి గ్రాడ్యుయేట్ నిరుద్యోగికి 88 వేల రూపాయల బాకీ పడిందన్నారు. దీంతోపాటు –మిగతా3లో..




## ఎన్నికల విధుల్లో జాగ్రత్తలు పాటించాలి

**అచ్చంపేట రెవెన్యూ డివిజన్ అధికారిణి మాధవి**



పోలింగ్ సిబ్బంది శిక్షణ శిబిరంలో అవగాహన కల్పిస్తున్న ఆర్డిఓ మాధవి

**ఉప్పునుంతల, అక్టోబరు 1 ప్రభాతవార్త :** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు తీసుకోవాల్సి న జాగ్రత్తలపై నిర్వహించిన శిక్షణ శిబిరంలో అచ్చంపేట రెవెన్యూ డివిజన్ అధికారిణి మాధవి పాల్గొన్నారు. బుధవారం స్థానిక రైతు వేదిక కార్యాలయం లో స్థానిక సంస్థల ఎంపిటీసీ, జెడ్పిటిసి, గ్రామపంచాయతీ ఎన్నికల సంబంధించి పి ఓ లకు శిక్షణ ఇచ్చారు. ఎన్నికల సమయంలో తీసుకోవాల్సి న జాగ్రత్తలు, ఎన్నికల సరళి, ఓటర్లు ఓటు వేసే ఓటర్లను ఇబ్బంది పెట్టకుండా తీసుకోవాల్సి న జాగ్రత్తలపై ఆమె అవగాహన కల్పించారు. ఈ శిక్షణ శిబిరంలో అచ్చంపేట రెవెన్యూ డివిజన్ అధికారిణి మాధవి, మండల ప్రత్యేక అధికారి నాగేందర్, ఎంపిడిఓ మోహన్ లాల్, ఇంచార్జ్ తహశీల్దార్ పరుష్ నాయక్, మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్, మండల పంచాయితీ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా హెచ్ఎంల సంఘం అధ్యక్షుడు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, పోలింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

**రాజకీయ పార్టీ నేతలతో మండల అధికారులు**



మాట్లాడుతున్న మండల అధికారులు

**నవాబుపేట, అక్టోబరు 1 ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణం లో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని మండల వివిధ రాజకీయ రాజకీయ పార్టీ నాయకుల సమావేశంలో మండల అధికారులు తహసిల్దార్ ఎంపీడీవో జయరాం నాయక్ నవాబుపేట ఎస్సై విక్రం అన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికలకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాజకీయ నాయకులపాత్ర ఉండాలని అందుకు ప్రభుత్వ అధికారులకు సహకరించాలని ఈ సందర్భంగా రాజకీయ నాయకులకు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నియమావళిపై ప్రతీ గ్రామంలో ఆయా రాజకీయ పార్టీలకు చెంది న కనీసం ఒక్కో కార్యకర్తకైనా అవగాహన కలిగించాలన్నారు. ఎన్నికలకు సంబంధించి పోటీ చేసే అభ్యర్థులకు ఎలాంటి సందేహాలున్నా సంబంధిత అధికారులను అడిగితే తెలియజేస్తారన్నారు. ఎలాంటి ఘర్షణకు తావు లేకుండా ప్రశాంతవాతావరణంలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు అభ్యర్థులు సహకరించేలా ఆయా పార్టీల నాయకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జై రామ్ నాయక్ ఎస్ఐ విక్రమ్ మండల వివిధ రాజకీయ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతతోనే ఆరోగ్యం

**ఊట్కూర్, అక్టోబరు 1 ప్రభాత వార్త :** ప్రమీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఊట్కూర్ మండల కేంద్రంలోని ఓంనగర్ కార్గిల్ చౌరస్తాలో బుధవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. కోరం మహేష్ మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుంది. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి" అని పిలుపునిచ్చారు. తరువాత సభ్యులు, స్థానిక పెద్దలు కలిసి చౌరస్తా పరిసరాలను శుభ్రపరిచారు. శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించారు. కాలుష్య నిర్మూలనలో భాగంగా ప్రతి ఒక్కరూ చెట్ల పెంపకానికి తోడ్పడాలని డా. మహేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రమీల ఫౌండేషన్ సభ్యులు, ఓంనగర్ పెద్దలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## జాతీయ క్రీడాకారుడికి ఘన సన్మానం

**శ్రీరంగాపూర్, అక్టోబరు 1 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రానికి చెందిన బొబ్బిలి నాగన్న లక్ష్మి   మ్మ దంపతుల కుమారుడు కురుమూర్తి యాదవ్ ఖోఖో క్రీడలో జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పోటీలకు సిద్ధమవుతున్న కురుమూర్తి యాదవ్‌ను శ్రీరంగాపూర్ శ్రీకృష్ణ యాదవ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి సతీష్ యాదవ్, కన్వీనర్ వసంతపురం రాజు, ఉపాధ్యక్షులు రామచంద్రి శాలువతో ఘనంగా సన్మానించడం జరిగింది. ప్రధాన కార్యదర్శి సతీష్ యాదవ్ కన్వీనర్ వసంతపురం రాజు మాట్లాడుతూ కురుమూర్తి యాదవ్ చదువులోనే కాకుండా క్రీడల్లో కూడా రాణించి భవిష్యత్తులో మంచి ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని కురుమూర్తి యాదవ్ నిరూపించాడని, దీనిని యువత ఆదర్శంగా తీసుకోవాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ కృష్ణ యాదవ సంఘం సలహాదారులు బాలస్వామి, కార్యవర్గ సభ్యులు శేఖర్, సభ్యులు చింతల వెంకటయ్య, కర్రెన్న, బిచ్చన్న, గణపతి, బండలయ్య, ముంత శ్రీను, పరుశరాములు, శివ, రామ్ లక్ష్మణ్, నాగరాజు, యువత మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## హజ్రత్ సయ్యద్ షా మహమ్మద్ తఖీ సబ్జ్‌పోష్ ఖాద్రీ రహ్ వార్షిక ఉర్సు

**నారాయణపేట, అక్టోబరు 1 ప్రభాతవార్త :** నారాయణపేట్ పట్టణంలోని హజ్రత్ సయ్యద్ షా మహ్మద్ తఖీ సబ్జ్‌పోష్ ఖాద్రీ రహ్ దర్గాలో నాలుగు రోజులపాటు జరిగే వార్షిక ఉరుసు వేడుకలు అక్టోబర్ 2న పతాక ఊరేగింపుతో ప్రారంభం కానున్నాయి. తెలంగాణతో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ముంబై, అహ్మదాబాద్ ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు మురీదులు హాజరవుతారు. అక్టోబర్ 2న పతాకా ఊరేగింపు 3న సందల్ ఊరేగింపు, 4న గియారవీ షరీఫ్‌తో మహ్ఫిల్ ఎనాత్, 5న మహ్ఫిల్ ఎజియారత్ అజ్మత్ ఎ ఔలియా మహాసభ సాయంత్రం మహ్ఫిల్ ఎసమా జరుగుతాయి. ఈ కార్యక్రమాలను హాఫిజ్ మహ్మద్ చంద్ పాషా నిర్వహిస్తారు. హైదరాబాదు, ముంబై నుంచి ప్రముఖ ఖవ్వాలి పార్టీలు నాత్ మన్‌ఖబత్ కవ్వాలీలు ఉంటాయని భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు సజ్జాదానషీన్ సయ్యద్ షా గియాస్‌ద్దీన్ ఖాద్రీ తెలిపారు. నిర్వాహకులు అందరినీ ఉర్సు వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

## ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

**నారాయణ పేట, అక్టోబరు 1 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని వయోవృద్ధుల గృహంలో మేరా యువ భారత్ మై భారత్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని వృద్ధుల చేతుల మీదుగా మొక్కలు నాటించడం ద్వారా ప్రారంభించారు అనంతరం వృద్ధులందరికీ పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు మిఠాయిలు పంపిణీ చేశారు ఈ సందర్భంలో ఓల్డేజ్ హోమ్ సంరక్షకులు సాయి మాట్లాడుతూ మేరా యువ భారత్ సంస్థ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమైన విషయం వృద్ధులను ప్రోత్సహించి వారిలో ధైర్యాన్ని నింపడం గొప్ప సేవ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మై భారత్ జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ అనిల్ కుమార్ గౌడ్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జగదీష్ గౌడ్, యువకులు నరేష్, నవీన్, నందకిశోర్, మున్నా తదితరులు పాల్గొన్నారు. అలాగే వయోవృద్ధుల గృహం సంరక్షకులు సాయి కె.లక్ష్మి   మ్మ ,ఎన్.లక్ష్మి   మ్మ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ యువతకు నర్సరీ యజమాన్యంపై శిక్షణ



సర్టిఫికెట్లు అందజేస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

**వీపనగండ్ల అక్టోబర్ 1, ప్రభాతవార్త:** గ్రామీణ యువత నర్సరీ యజమాన్యంపై కృషి విజ్ఞాన కేంద్రం మదనాపురం వారిచే శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు రాజేందర్ రెడ్డి, ఉద్యాన శాస్త్రవేత్త సురేష్ కుమార్ తెలిపారు. ప్రధానంగా గ్రామీణ యువతీ యువ కులు మామిడి తోటలు, ఇతర ఉద్యాన పంటలు అయిన పూల మొక్కలు, వివిధ రకాల నర్సరీలను ఏర్పాటు చేసుకోవడం దానిపై ఏడు రోజులు డ్రాప్పింగ్ బ్రూడింగ్ మొక్కలకు అంట్లు కట్టే విధానం మొదలగు సాగు పద్ధతులపై శిక్షణ ఇవ్వడం జరిగిందని వారు శిక్షణ పొందిన తర్వాత సర్టిఫికెట్లు అందజేయడం జరిగిందని వారు తెలిపారు. ఇందులో గద్వాల వనపర్తి జిల్లాకు సంబంధించినటు వంటి యువతి యువకులు 16 మంది పాల్గొనడం జరిగిందని ఇంకా శిక్షణ పొందేవారు. ఉంటే నిరుద్యోగ యువతి యువకులకు కూడా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వారు తెలిపారు.

## రైతులకు వరి బోనస్ వెంటనే చెల్లించాలి



**బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రవీణ్ కుమార్ రెడ్డి**

**ధన్వాడ, అక్టోబరు1 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రరైతాంగానికి యాసంగి వరి ధాన్యం క్వింటాల్కు ప్రభుత్వం ప్రకటించిన రూ.500ల బోనస్ వెంటనే చెల్లించాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభు త్వం రైతాంగానికి యాసంగి వరి ధాన్యం క్వింటాల్కు 500 రూపాయలు బోనస్ చెల్లిస్తామని హామీ ఇచ్చింది. గత సంవత్సరం రైతులు ప్రభుత్వం బోనస్ అందిస్తుందనే ఉద్దేశంతో గంపెడు ఆశలతో ప్రభుత్వానికి ధాన్యం అమ్మారు. కానీ నేటికీ సంవత్సరం గడుస్తున్నా రైతన్నకి బోనస్ అందలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే గత బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల్లో అధికారం కోసం ప్రజలకు అనేక వాగ్దానాలు చేసింది అందులో ప్రధానమైన వాగ్దానాలు రైతులకు రైతుబంధు ఇస్తామని వరి ధాన్యానికి క్వింటాల్కు రూ. 500ల చొప్పున బోనస్ చెల్లిస్తామని హామీ ఇచ్చింది. ఇవి కాక ఆరు గ్యారెంటీలు 420 హామీలు ఇచ్చింది. అధికారం చేతికి వచ్చిన తర్వాత వాటి అమల్లో ఎలాంటి చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదన్నారు. మోసపూరిత మాటలతో పాత ప్రభుత్వాల బాటలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం నడుస్తుందని అన్నారు.

# కన్నుల పండుగగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**- 9వ రోజు శ్రీ మహిషాసుర మర్ధిని దేవి అలంకరణలో అమ్మవారు**



మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



పూజలు చేస్తున్న చైర్మన్ వెంకటేశ్వర రెడ్డి దంపతులు



శ్రీ మహిషాసుర మర్ధిని అలంకరణలో అమ్మవారు

**కల్వకుర్తి, అక్టోబర్ 01 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణం లోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో గత పది రోజులుగా వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం శ్రీ మహిషాసుర మర్దిని దేవి అలంకరణలో భక్తులకు అమ్మవారి దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాత సేవ అభిషేకాలు దంపతలచే కుంకుమార్చన, భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణం, చండీ మహా హోమం నిర్వహించినట్లు దేవాలయం చైర్మన్ పౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్‌బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గందె రవిలు తెలిపారు. ఈరోజు అమ్మవారిని జిల్లా పౌరసరఫరాల అధికారులు డిఎస్ఓ నర్సింగ్ రావు, డిఎం రాజేందర్, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డిలు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరందరినీ దేవాలయం చైర్మన్ పౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్ బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గందె రవి, ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించి మెమెంటోతో సత్కరించారు. హిందూ ఐక్య వేదిక సంఘం సభ్యులు దసర పండుగ గురించి, హిందూ సంస్కృతి సంప్రదాయాల గురించి అవగాహన కల్పించారు. అదే సంప్రదాయ బద్ధంగా దుస్తులు అలంకారంతో దేవాలయానికి వచ్చిన మహిళలకు బహుమతులు దాత రాచూరు రాంమోహన్ సహకారంతో అందజేశారు. అదే విధంగా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి బంగారు కిరీటం కోసం దొంతు రాంమోహన్ తులం బంగారం, గుండ మధుసూధన్ అర తులం బంగారం బహుకరించినట్లు దేవాలయం చైర్మన్ పౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్ బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గందె రవిలు తెలిపారు. అనంతరం వారిని ఉత్సవ కమిటీ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం పెద్ద మంగళ హారతి దాతల సహకారంతో భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం కోలాటాలు దాండియా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సలహాదారు వాసశేఖర్, కమిటీ ప్రధాన కార్యదర్శులు గుండ్ల రేవంత్, డి.నితిన్, కోశాధికారిలు పోల గిరిబాబు, సంబ తరుణ్‌లు ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు సభ్యులు, మహిళలలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**కనకదుర్గ దేవిగా వాసవీమాత**

**కల్వకుర్తి, అక్టోబర్ 01 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవి మాత కనకదుర్గ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ కలిమిచర్ల రమేష్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కలిమిచర్ల రమేష్‌ను ఘనంగా సత్కరించారు. మహబూబ్‌నగర్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుండా వెంకటేష్ బృందం, వాసవి క్లబ్ డిస్టిక్ మాజీ గవర్నర్ కలకొండ రాఘవేందర్, వాసవి క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**మహిషాసురమర్ధిని అలంకరణలో అమ్మవారు**

**కల్వకుర్తిరూరల్, అక్టోబర్ 01 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం తుర్కలపల్లి గ్రామంలో దుర్గాదేవీ యూత్ ఆధ్వర్యంలో దేవీశరన్నవరాత్రోత్సవాలు అంగరంగా వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు అమ్మవారు మహిషాసుర మర్ధిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు వంశీకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి నిత్య పూజలందిస్తున్నారు. యూత్ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అర్చన కార్యక్రమాలు నిర్వహిస్తూ నిష్ఠ నియమాలతో కొలుస్తున్నారు. కార్యక్రమంలో దుర్గామాత యూత్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

**మహిషాసుర మర్దిని దేవిగా అమ్మవారు దర్శనం**

**నారాయణపేట టౌన్, అక్టోబరు 1 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రములోని సంత్ మత మూల మహా సంస్థానం శక్తి పీఠంలో శ్రీదేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం 10వ రోజు సందర్భంగా అమ్మవారు భక్తులకు మహిషాసుర మర్దిని దేవి రూపంలో దర్శనం ఇచ్చారు. మహిషాసుర మర్దిని దేవి హోమమును నిర్వహించడం జరిగింది. పూజా కార్యక్రమంలో మాధురి ధరక్, హనుమాన్ ధరక్ దంపతులతో బాటు ప్రముఖ తెలుగు సీరియల్ నటి మనులు పాల్గొన్నారు. అమ్మవారికి మహా నివేదన సమర్పణ చేసి, మహా మంగళ హారతి చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు శక్తి పీఠం సంత్ మత మూల మహా సంస్థానం సభ్యులు తదితరులు ఉన్నారు.

**మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చిన అమ్మవారు**

**పెబ్బేరు, అక్టోబరు 1 ప్రభాతవార్త :** దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెబ్బేరు మండలం కంచిరావుపల్లి చెన్నకేశవ స్వామి ఆలయంలో బుధవారం మహిషాసుర మర్దిని గా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే అమ్మవారి మూలవిరాట్తో పాటు ఉత్సవ విగ్రహానికి ఆలయ అర్చకులు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన పుల్లూరు వెంకటేశ్వర రెడ్డి దంపతులు పూజలో కూర్చుకున్నారు. అమ్మవారి ఉత్సవ విగ్రహంతో పురుషులు, మహిళలు పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు మహా మంగళహారతి నీరాజనం ఇచ్చి భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుల్లూరు వెంకటేశ్వర రెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**అన్నపూర్ణాదేవిగా పర్వతాపూర్ మైసమ్మ దేవత**



పర్వతాపూర్ మైసమ్మ దేవత



పర్వతాపూర్ మైసమ్మ దేవత

**నవాబుపేట, అక్టోబరు 1 ప్రభాతవార్త:** కాకర్లపాడు పర్వతాపూ మండల పరిధిలోని కాకర్లపాడు మైసమ్మ అమ్మవారు బుధవారం శాకాంబరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ సిబ్బంది, చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి కార్యనిర్వహణాధికారి నర్సింలు, ఆలయఅర్చకులు సిబ్బంది శ్రీకాంత్ శర్మ, భార్గవ్ శర్మ, గొల్లగోపాల్, పి ఆంజనేయులు, కె.మల్లేష్, కె.రమేష్, అనసూయమ్మ, వెంకటయ్య, భీమయ్య, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ రికార్డ్ అసిస్టెంట్ గోపాల్ మల్లేష్ ధర్మకర్త మండలి సభ్యులు భక్తుల సమక్షం లో పూజాకార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఆలయ సిబ్బందితో పాటు కాకర్లపాడు ప్రజాప్రతినిధులు, నరేందర్, పాశం రామస్వామి పాల్గొన్నారు.

**మహిషాసురమర్ధిని అలంకరణలో..**

**జడ్చర్ల, అక్టోబర్ 01 ప్రభాతవార్త:** బాదేపల్లి పట్టణంలోని తాటిచెట్టు మైసమ్మ ఆలయంలో అమ్మవారు బుధవారం మహిషా సురవర్ధినిగా దర్శనమిచ్చారు. ఉదయం నుంచే అమ్మవారి మూలవిరాట్తో పాటు ఉత్సవ విగ్రహానికి ఆలయ నిర్వాహకులు పంచామృతా భిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణానికి చెందిన పలువురు దంపతులు కుంకుమార్చనలో పాల్గొన్నారు.

# చెరుకు రైతుల పోరాట ఫలితమే సమస్యల పరిష్కారం

**కృష్ణవేణి చెరుకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, కె.రాజన్న**



మాట్లాడుతున్న చెరుకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు రాజన్న

**అమరచింత అక్టోబర్ 1, ప్రభాతవార్త :** చెరుకు రైతుల పోరాట ఫలితమే కృష్ణవేణి చెరుకు రైతు సంఘం యాజమాన్యం సమస్యల పరిష్కారానికి కృషి చేసిందని కృష్ణవేణి చెరుకు రైత సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, కే.రాజన్న అన్నారు. బుధవారం అమరచింత మండలంలోని నాగర్ కడుమూర్, ధర్మాపూర్ గ్రామాలలో చెరుకు రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ, కృష్ణవేణి చెరుకు ఫ్యాక్టరీ యాజమాన్యం 2025, 26 సీజన్లో చెరుకు అభివృద్ధి కోసం ఫ్యాక్టరీ యజమాన్యం చెరుకు రైతులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కృష్ణవేణి చెరుకు ఫ్యాక్టరీ యజమాన్యం టన్ను చెరుకు 3924 చెల్లిస్తుందని ఆయన అన్నారు. మే, జూన్ నెలలో చెరుకు పంట వేసే రైతులకు సీడు ఉచితంగా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. చెరుకు రైతుల సమస్యల పరిష్కారం కోసం రైతులు ఐక్యంగా ఉండి సాధించుకోవాలని ఆయన రైతులను కోరారు. అలాగే చెరుకు రైతుల డిమాండ్లు పరిష్కరించినందుకు కృష్ణవేణి ఫ్యాక్టరీ యజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర రెడ్డి, రంగారెడ్డి, మహేంద్రా చారి, శ్రీనివాసులు, మల్లారెడ్డి, వెంకట్ రెడ్డి, రాజారెడ్డి, తిరుపతి రెడ్డి, సంజీవరెడ్డి, వెంకటేష్, నరసింహయ్య, గోవిందు, ఆనంద్ రెడ్డి, శ్రీనివాసులు, రంగన్న, రామాంజనేయులు, సత్య రెడ్డి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## మందకృష్ణ మాదిగను కలిసిన టంకరి శివప్రసాద్



**మహబూబ్‌నగర్, అక్టోబర్ 01 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర "ఎమ్మార్పీఎస్" వ్యవస్థాపక అధ్యక్షులు "పద్మశ్రీ" అవార్డు గ్రహీత గౌరవనీయులు మాన్యశ్రీ "మంద కృష్ణ మాదిగ" అన్నగారిని మర్యాదపూర్వకంగా కలిసిన "సహాయ ఫౌండేషన్" వ్యవస్థాపక అధ్యక్షులు, తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు "డా.టంకరి శివప్రసాద్ యాదవ్".

# పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో విజయదశమి పూజలు





విజయదశమి సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న ఆర్ఐ నరసింహ

**నారాయణపేట, అక్టోబరు1 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో విజయదశమి సందర్భంగా ఆర్ఐ నరసింహ ఆయుధ పూజ నిర్వహించగా ఎంటిఓ ఆర్ఎస్ఐ శివశంకర్ వాహన పూజ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ నరసింహ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు అధికారులకు విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడు పై మంచి గెలిచిన దినోత్సవమే విజయ దశమి అని, చెడును పారద్రోలడంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో పండగ జరుపుకోవాలని వారు అనుకున్న కార్యాలు విజయవంతం కావాలని ఆకాంక్షి   ంచారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హుల్ హక్, ఆర్ఎస్ఐలు శ్వేత, శిరీష, కృష్ణ చైతన్య, ఏఎస్ఐలు, అర్మడు రిజర్వ్ పోలీసులు పాల్గొన్నారు.

## భవానీ మందిర్‌లో ఘనంగా ఆయుధ పూజ



**నారాయణపేట టౌన్, అక్టోబరు 1 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రం దూల్ పేట అంబా భవానీ మందిరంలో దేవీ నవరాత్రి వేడుకలలో భాగంగా బుధవారం ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. ఈ వేడుకల్లో ఉత్సవ సమితి అధ్యక్షుడు భీంచందర్ గౌడ్, కార్యదర్శి మిర్చి వెంకటయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ, సభ్యులు రఘువీర్ యాదవ్, శివకుమార్, ఆశప్ప, నిర్వాహకులు పాల్గొన్నారు.

# దేశాన్ని కంటికి రెప్పలాగ కాపాడే సంస్థ ఆర్ఎస్ఎస్

**హిందు వాహిని ప్రాంత సంఘటన మంత్రి యాది రెడ్డి**



ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న స్వయం సేవకులు



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న వక్త యాది రెడ్డి



ప్రార్థనలో పాల్గొన్న స్వయం సేవకులు

**బిజినేపల్లి, అక్టోబరు1 ప్రభాతవార్త:** దేశాన్ని కంటికి రెప్పలా కాపాడే ఒక గొప్ప సంస్థ ఆర్ఎస్ఎస్ అని హిందు వాహిని ప్రాంత సంఘటన మంత్రి యాదిరెడ్డి అన్నారు. విజయదశమి పర్వదినం స్థాపించిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను పాలెం ఖండ ఆధ్వర్యంలో బాలాజీ గార్డెన్స్‌లో నిర్వహించారు. వక్తగా హాజరైన యాదిరెడ్డి మాట్లాడుతూ దేశంలో నిత్య శాఖ ద్వారా అనేకమంది స్వయం సేవకులను దేశ భక్తులుగా యువకులను తయారు చేస్తూ జాతీయ వాద సిద్ధాంతం ద్వారా నిత్యం, నిరంతరం దేశంలో ఈ ధర్మం కోసం కృషి చేస్తుందన్నారు. స్వచ్ఛమైన నిష్కలమైనటువంటి ఈ దేశానికి అసలైన పునాది ఆర్ఎస్ఎస్ అని అన్నారు. దేశము ధర్మము జాతీయత భావాలు దేశంఎప్పుడు సస్యశ్యామలంగా ఉండాలనీ కోరుకునేది ఒక్క ఆర్ఎస్ఎస్ మాత్రమేనన్నారు. భారత దేశ స్వాతంత్ర పోరాటంలో తన అనుభవాలతో హెడ్గేవార్ బాగా ప్రభావితమయ్యారనీ, భారతదేశ సాంస్కృతిక గుర్తింపును కాపాడటానికి, ప్రోత్సహించడానికి ఐక్యమైన, క్రమశిక్షణ కలిగిన సమాజాన్ని సృష్టించడానికి ప్రయత్నించారని తెలిపారు. దేశ ఐక్యత కోసం ఆర్ఎస్ఎస్‌ను డాక్టర్ కేశవ్ బలిరాం హెడ్గేవార్ 1925 సంవత్సరంలో దసరా నాడు స్థాపించారని నేటికీ వందేళ్లు పూర్తిచేసుకుని శూన్యం నుండి వెలుతురు నిర్మాణంలా ఆర్ఎస్ఎస్ దేశంలో అనేకమైనటువంటి సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తుందని చెప్పారు. ప్రపంచ దేశాల్లో నేడు భారత్ అంటే ఒక విధమైన గౌరవం, ప్రపంచాన్ని నాశనం చేయాలని జాతులకు భయం పుట్టిస్తున్న ఏకైక దేశం మన భారతదేశం అన్నారు. హిందువులు ఎక్కడ బలంగా, ఐక్యంగా ఉంటారో అక్కడ అక్కడ విజయపథం వైపు నడుస్తామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 162 దేశాల్లో ఆర్ఎస్ఎస్ విస్తరించిందని అనేక రంగాల్లో శాఖలు పనిచేస్తున్నాయని వివరించారు. ఎక్కడ వ్యక్తి నిర్మాణం అవుతుందో అక్కడ దేశ నిర్మాణం అవుతుందని, శాఖ అనేది పవర్ హౌస్ లాంటిదని అంతరిక్షం దాకా స్వయంసేవకులు ఆయా రంగాల్లో పనిచేస్తున్నారని చెప్పారు. ఆర్ఎస్ఎస్ క్రమశిక్షణ కలిగినటువంటి వ్యక్తులను నిత్య శాఖ ద్వారా తయారు చేస్తుందన్నారు. ఇలా తయారు కాబడిన స్వయం సేవకులు వివిధ రంగాల్లో ఈ దేశం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాల పట్ల విదేశీయులు ఆకర్శితులై నేడు వాటిని పాటిస్తూ మన దారిలో వారిని నడిపిస్తున్న ఏకైక దేశం మన భారతదేశం. వందేళ్ళ యజ్ఞంలో పూర్ణాహుతిలో ఉన్నామని సమిదలుగా పనిచేసి ప్రపంచంలో విశ్వ గురువుగా నిలుద్దామని కోరారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన పదసంచలనం కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీధుల వెంట మహిళలు చిన్నారులు పూల వర్షంతో భగవత్ ధ్వజానికి స్వాగతం పలికారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీపీ పుప్పాల శ్రీనివాస్ గౌడ్, పతాంజలి యోగ రాష్ట్ర అధ్యక్షులు వస్పరి శివుడు, ముఖ్య శిక్షక్ జాకీర్ హుస్సేన్, శిక్షకులు విష్ణు ,మహేష్, స్వయంసేవకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## భూత్పూర్‌లో దుర్గామాత శోభయాత్ర

### - ఆట పాటలతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు



**భూత్పూర్, అక్టోబర్1, ప్రభాతవార్త:** గత తొమ్మిది రోజులుగా వివిధ రూపాలలో అలరించిన దుర్గామాతను నిర్వాహకులు బుధవారం భూత్పూర్‌లో భారీ ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి శరన్నవరాత్రులు భూత్పూర్‌లో గడిచిన తొమ్మిది రోజులు ఘనంగా నిర్వహించారు. ప్రతిరోజు అఖండ భజనలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రోజుకో అవతారంలో దర్శనమిచ్చిన దుర్గమ్మ బుధవారం జలప్రవేశానికి ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపును పట్టణంలోని సీపీఎస్, మున్సిపాలిటీ కార్యాలయం మీదుగా ఎస్సీ కాలనీ, బీసీకాలనీ, ఐదోవార్డుల మీదుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు బోరింగ్ నర్సింహులు, గొడుగు వెంకటరాజు, వెంకట నారాయణ, వడ్ల బ్రహ్మయ్య, కృష్ణయ్యగౌడ్, సత్తూర్ అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు



**కల్వకుర్తి, అక్టోబర్ 1 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో దుర్గమ్మ తల్లి చిత్రపటానికి పూలమాలవేసి ఆసుపత్రిలోని సామాగ్రికి ఆసుపత్రి సూపరింటెండెంట్ శివరాం ఆధ్వర్యంలో ఆయుధ పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అనతరం సిబ్బంది అందరితో బతుకమ్మ పండుగ సంబరాలను నిర్వహించారు. ఆటపాటలతో పని ఒత్తిడి నుంచి విముక్తి కలిగే విధంగా ఈ కార్యక్రమాలు తోడ్పడుతున్నాయని ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ శివరాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు యశోదా బాయి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ ముగింపు ఉత్సవాలలో ఎమ్మెల్యే విజయుడు



**ఇటిక్యాల అక్టోబర్ 1, ప్రభాతవార్త;** మండల పరిధిలోని షేక్‌పల్లి గ్రామంలో బతుకమ్మ ఉత్సవాలు దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి. యువ నేత శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. 9రోజులపాటు గ్రామంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు. మహిళల. చిన్నారుల కోలాటాలు అందరిని అలరించాయి. బుధవారం సాయంత్రం అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు బతుకమ్మ ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదే విధంగా చిన్నారులు. మహిళలలు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆటపాటఆడారు. దీంతోబతుకమ్మ ముగింపు ఉత్సవం సంతోషంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడును. స్థానిక నేతలను నిర్వాహకులు శాలువ పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి హనుమంత్‌రెడ్డి, మాజీ జోగులాంబ ఆలయ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, సింగల్ విండో చైర్మన్ రంగారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, ఆర్.కిషోర్, ఈదన్న, భీమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి ఎల్కోటి ఎల్లారెడ్డికి ఘన నివాళి

**ఊట్కూర్, అక్టోబరు1 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాజీ మంత్రి కీ.శే. ఎల్కోటి ఎల్లారెడ్డి జన్మదిన వేడుక జరిగింది. స్థానిక నేతలు, కార్యకర్తలు, గ్రామవాసులు కలిసి స్వీట్లు పంచి ప్రత్యేకంగా గుర్తించుకున్నారు. జగదీశ్ గౌడ్ మాట్లాడుతూ, మంత్రిగా ఉన్న సమయంలో కీ.శే.ఎల్కోటి ఎల్లారెడ్డి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, రైతు సంక్షేమ పథకాలు మనకు అందించిన స్ఫూర్తి" అని గుర్తుచేశారు. కార్యక్రమంలో కొక్కు శంకర్, కొక్కు నర్సిములు, తమ్మిరెడ్డి గ్రామంలోని పలువురు స్థానికులు పాల్గొన్నారు. ఈ వేడుకలో గ్రామీణ వాతావరణం, ఒకరికొకరు ఆనందాన్ని పంచుకుని సందడి స్పష్టంగా కనిపించింది.

## మృతుడి కుటుంబానికి మంత్రి పరామర్శ



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

**ఊట్కూర్, అక్టోబరు 1 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండల పరిధిలోని నిడుగుర్తి గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నారాయణ రెడ్డి కుమారుడు భారత్ రెడ్డి మృతి చెందడంతో గ్రామమంతా శోకసముద్రంలో మునిగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న మంత్రి వాకిటి శ్రీహరి వెంటనే గ్రామానికి చేరుకొని, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ – కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ మీ కుటుంబానికి అండగా ఉంటుంది" అని ధైర్యం చెప్పారు.

## పత్తి రైతులకు ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం చెల్లించాలి

### సామాజిక కార్యకర్త బిజ్వార్ మహేష్‌గౌడ్



పత్తి పంటను పరిశీలిస్తున్న దృశ్యం

**ఊట్కూర్, అక్టోబరు1 ప్రభాతవార్త:** అకాల వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన పత్తి రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం అందించాలంటూ సామాజిక కార్యకర్త బిజ్వార్ మహేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఊట్కూర్ మండల పరిధిలోని బిజ్వార్, మగ్దంపూర్, అవసలోనిపల్లి గ్రామాలలో ఎర్రబారిన పత్తి పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ – పత్తి పంటలకు రైతులు అధిక పెట్టుబడులు పెట్టి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలనలు జరిపినష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించాలన్నారు.

## ఎన్నికల శిక్షణ కార్యక్రమం

**ఊట్కూర్, అక్టోబరు1 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో ప్రజా పరిషత్ సెకండ్ ఆర్డినరీ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ప్రిసైడింగ్ ఆఫీసర్లు (పిఓ), అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు (ఎపిఓ) శిక్షణ కార్యక్రమం జరిగింది. జిల్లా శిక్షణ కలెక్టర్ ప్రణయ్ కుమార్ ఈ కార్యక్రమానికి హాజరై, ఎన్నికల నిర్వహణలో అనుసరించాల్సిన విధానాలు, నియమాలు, జాగ్రత్తలపై అధికారులకు మార్గదర్శక సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ధనుంజయగౌడ్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, అలాగే మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అధికారులు ఎన్నికల ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.



ఎన్నికల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

# గ్రామాలలో అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్

### ◆ ఎన్నికల సభలు, ర్యాలీలకు పోలీసుల నుండి అనుమతులు తీసుకోవాలి : ఎన్నికల మండల నోడల్ అధికారి, తహసీల్దారు వీరభద్రప్ప



మాట్లాడుతున్న మండల నోడల్ అధికారి, తహసీల్దార్ వీరభద్రప్ప

**ఇటిక్యాల అక్టోబర్1, ప్రభాతవార్త;** మండల పరిధిలోని గ్రామాలలో జరిగే జడ్పిటిసి ఎంపిటిసి సర్పంచులు వార్డ్ మెంబర్ల కు సంబంధించి సభలు ర్యాలీలు చేపట్టేందుకు పోలీసుల నుండి అనుమతులు తీసుకోవాలనిఖి అలాగే రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టర్లు ఉండరాదని గోడలపై రాసేందుకు ఇంటి యజమాని అనుమతులు తీసుకోవాలని ఎన్నికల మండల నోడల్ అధికారి తాసిల్దారు వీరభద్రప్ప రాజకీయ పార్టీల ప్రతినిధులకు గ్రామాల నోడల్ అధికారులకు వివరించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల నియామ వాలి ప్రవర్తనపై ఎంపీడీవో మహ్మద్ అజార్ మోహియుద్దీన్, జడ్పిటిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి సునంద, ఎస్సై రవి లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నోడల్లో అధికారి ఎన్నికల ప్రవర్తననిబంధనలపై తాహ సిల్దార్ వీరభద్రప్ప మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ జడ్పిటిసి ఎంపిటిసి సర్పంచ్ వార్డ్ మెంబర్ల ఎన్నిక కోసం ఈ నెల రెండు రోజుల క్రితం షెడ్యూల్ విడుదల చేసిందని అలాగే ఎన్నికల తేదీలు నామినేషన్ ఫలితాలు తేదీ కూడా ప్రకటించిందని అందువల్ల 29వ తేదీ నుండి గ్రామాలలో ఎన్నికల నియామవళి ప్రవర్తన అమలులోకి వచ్చిందన్నారు. నేపథ్యంలో ఆయాపార్టీల అభ్యర్థులు నియమావళి పాటించి అధికారులకు సహకరించాలన్నారు. సభలు ర్యాలీలు చేపట్టాలనుకుంటే ముందుగా పోలీసులు అనుమతి తీసుకోవాలని అలాగే రాజకీయ పార్టీల కు చెందిన వారి విగ్రహాలు గ్రామాలలో ఉన్నట్లయితే వాటిని కప్పి ఉంచాలన్నారు. ఎన్నికల నిర్వాణ కోసం గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని అలాగే వారికి సహాయకులుగా కొత్తగా వచ్చిన గ్రామ పాలన అధికారులు ఉంటారని కానీ పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి రాజకీయ పార్టీల అభ్యర్థుల ప్రచారలపై నిఘా ఉంచాలన్నారు. రోజుకు ఎప్పటికప్పుడు ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల ప్రచార నిర్వహణలపై అలాగే ప్రజల ఫిర్యాదులపై మండల నోడల్ అధికారి దృష్టికి తీసుకువస్తే వాటిని జిల్లా నోడల్ అధికారి దృష్టికి తీసుకు పోతామన్నారు. ప్రశాంతంగా స్థానిక సంస్థలుఎన్నికలు నిర్వహణ కోసం రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పిటిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి సునంద, ఎంపీడీవో మహమ్మద్ అజార్ మోహియుద్దీన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రామచంద్రారెడ్డి, బిఎస్పీ పార్టీకి చెందిన రాంబాబు, మణికుమార్, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి ఆశన్న, ఆర్ఐలు మనోహర్, మదన్‌మోహన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఎన్నికలు సజావుగా సాగేందుకు కృషి చేయాలి

### మండల ప్రత్యేక అధికారి నాగేందర్



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి నాగేందర్

**ఉప్పునుంతల, అక్టోబరు 1 ప్రభాతవార్త:** రాజకీయ పార్టీలు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించాలని మండల ప్రత్యేక అధికారి నాగేందర్ పిలుపునిచ్చారు. బుధవారం అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికలు త్వరలోనే జరగనున్నాయని, ఎన్నికల సిబ్బందికి రాజకీయ నాయకులు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శులు ఎన్నికలు సజావుగా సాగేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ మోహన్‌లాల్, ఇంఛార్జ్ తహశీల్దార్ పరుష్‌నాయక్, జిల్లా హెచ్ఎంల సంఘం అధ్యక్షుడు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్, మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# టిటిడి ఆధ్వర్యంలో శరన్నవరాత్రి మహోత్సవాలు



టిటిడి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

**ఊట్కూర్, అక్టోబరు1 ప్రభాతవార్త :** టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి పాలమూరు జిల్లా వారి ఆధ్వర్యంలో 2025 ఆశ్వయుజ మాస శరన్నవరాత్రి మహోత్సవాలు మూడు రోజులుగా నిర్వహించబడ్డాయి అని టిటిడి ఉమ్మడి పాలమూరు జిల్లా ఉపాన్యాసకులు దొరోల్ల కృష్ణయ్య తెలిపారు. నిన్న బిజ్వార్ శ్రీ చౌడేశ్వరి మాత దేవాలయంలో జరిగిన ప్రవచనంలో, నవరాత్రుల విశిష్టత, విజయదశమి, మహిషాసుర మర్ధని వంటి అంశాల గురించి వివరించారు. బుధవారం రాత్రి లలిత సహస్రనామ పారాయణం, అన్నమాచార్యసంకీర్తనల కార్యక్రమాలు జరిగేలా ఏర్పాట్లు అయ్యాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా హిందూధర్మం గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేయడానికి టిటిడి అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని కృష్ణయ్య తెలిపారు. వేదాలు, పురాణాలు, రామాయణం, భాగవతం, భగవద్గీత వంటి గ్రంథాల్లోని విషయాలను ప్రచారం చేయడం ద్వారా సమాజంలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రతివ్యక్తి మన సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. సమాజంలో వర్గాలు, కులాలు వేరే అయినా మానవులు ఒక్కటే అనే భావనతో హిందు వులు కలసి జీవించాలి అని చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లా కార్యనిర్వహణ అధికారి ఉత్తరపల్లి రామాచార్య లుకుగ్రామస్థులు ధన్యవాదాలుతెలిపారు. అలాగే, హెచ్.నర్సింహా, రాజమూరి, తిరుపతి, శ్రీనివాసులు, బాల నర్సింహా, కవిత, మంగమ్మ, బసమ్మ, కిష్టమ్మ, లక్ష్మి, మంజుల, కుసుమ కుమారి పాల్గొన్నారు.

## భూత్పూర్‌లో రేషన్‌షాపును తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్



**భూత్పూర్, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** భూత్పూర్ పట్టణ మున్సి పాలిటీ కేంద్రంలోని పదోవార్డులో ఉన్న ఒకటో రేషన్ దుకాణాన్ని బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ మధు సూధన్‌నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. చౌకధర దుకాణంలో ఉన్న స్టాక్ రిజిష్టర్లను అడిషనల్ కలెక్టర్‌తనిఖీ నిర్వహించారు. స్టాక్ పాయింట్‌ను జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్ మెంట్ డీటీ మమత తో పాటు డీలర్లు గడ్డంనర్సింహ్మా, యాదయ్య, జానకిరాములు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి)

నడవలేని పరిస్థితి ఎదుర్కోవాల్సి వచ్చిందని విచారం వ్యక్తం చేశారు. నేడు కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వంలో ప్రతి గ్రామం సస్యశ్యామలంగాఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రజల సంక్షేమం కోసం నేడు కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తూ నూతన సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు నిర్మించడం జరుగుతుందని ఆనందం వ్యక్తం చేశారు. కచ్చితంగా రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు తీసుకొచ్చి ప్రజా అవసరాలు తీరుస్తానని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్స్, కొత్త శ్రీనివాసులు, నిజాముద్దీన్, తీగల సురేందర్, జక్కా రాజు, కాంగ్రెస్ నాయకులు అచ్యుతారెడ్డి, హర్షరెడ్డి, కృష్ణరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులను స్కూటీ, విద్యభరోసా కార్డు కింద 50 వేల రూపాయలు బాకీ పడిందన్నారు. ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వచ్చే నాయకులకు ఈ విషయాలపై నిలదీయాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, హన్వాడ మాజీ ఎంపీపీ బాలరాజు, మాజీజడ్పీటీసీ నరేందర్, పార్టీ మహబూబ్‌నగర్ మండలాధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శివరాజ్, సీనియర్ నాయకులు మల్లు నర్సింహారెడ్డి, కొండ లక్ష్మయ్య, శ్రీకాంత్ గౌడ్, నవకాంత్, వేదవత్, చెన్నయ్య, జంబులయ్య తదితరులు పాల్గొన్నారు.

## సర్కారు భూమిలో వెంచర్ రోడ్డు

(మొదటి పేజీ తరువాయి)

శేరిగూడ గ్రామ శివారులోని సర్వేనెంబర్ 67, 68, 70, 71 లలో విస్తీర్ణం మొత్తం 9 ఎకరాల 24 గంటల భూమిలో ఓ ప్రైవేట్ వ్యక్తి వెంచర్ వేశాడు. ఇదే వెంచర్లు సర్వేనెంబర్ 78లో ఒక ఎకరా ప్రభుత్వ భూమిని వెంచర్ యజమాని రోడ్డు కోసం ఆక్రమించి ఆర్చినిర్మించాడు. అనుమతి లేకుండా ప్రభుత్వ భూమిని ఆక్రమించారని గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లి గ్రామానికి చెందినకోస్గి వెంకటయ్య మంగళవారం కలెక్టరేట్లో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వంభూమిని ఆక్రమిస్తున్న అక్రమార్కులకు తాసిల్దార్ కాపాడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని, ఆవెంచర్ యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## విజయాల దశమి

(మొదటి పేజీ తరువాయి)

ఊరేగింపుగా బయలుదేరి ఆరోజు పెద్దలు నిర్ణయించిన దిక్కుకు వెళ్లి అక్కడ ఉన్న శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించి శమీ పత్రాలను సేకరించుకుని విజయానికి సంకేతంగా, మంచికి శుభసూచకంగా శమీపత్రాలను పంచుతూ పరస్పరం ఆలింగనాలు చేసు కుంటూ విజయదశమి శుభాకాంక్షలు తెలుపు తారు. ఇక ఈ పండుగరోజున చాలామటుకు జనం మద్యం, మాంసంతో విందులు చేస్తు ఆస్వాధిస్తూ బంధు, మిత్రులతో సంతోషకర వాతావరణంలో ఆనం దోత్స వాల నడుమ పండుగను జరుపుతారు మరికొందరు.

***మద్యం, మాంసం ప్రియులకు మింగుడు పడని పండుగ...***

దసరా, గాంధీ జయంతి ఒకే రోజున రావడం, ఉండడం కొందరికి మింగుడు పడడంలేదు. గాంధీ జయంతి రోజున మద్యం, మాంసం విక్రయాలను విక్రయించడం నేషేధమని, ఆరోజు సుక్కా, ముక్కా లేకుంటే ఎట్లా?అని మద్యం ప్రియులుతమలో తాము ప్రశ్నించు కుంటు న్నారు. పండుగ పూట కూడా పస్తులేనా అన్న మీ మాంస ప్రతి మద్యం, మాంస ప్రియుల్లో అంతు చిక్కని ప్రశ్నగా మిగిలింది. ఈ రెండూ లేకుండా పండగెట్లాయని తమలో తాము ప్రశించు కుంటున్నారు.

## కాళికాదేవిగా దర్శనం

**జడ్చర్ల, అక్టోబరు1, ప్రభాతవార్త:** బాదేపల్లి పట్టణంలోవిద్యానగర్ కాలనీ బుధవారం రోజురేణుక ఎల్లమ్మ దేవాలయం ఆలయంలో దేవీశరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా రేణుక ఎల్లమ్మ కాళికాదేవి దర్శనం భక్తులకు దర్శనం ఇచ్చారు. దేవాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో విద్యానగర్ కాలనీ ఆలయ నిర్వాహకుడు గోనెల రాధాకృష్ణ మల్లికార్జున్ శ్రీనివాసులుకాలనీ మహిళలు లావణ్య, అలివేలమ్మ, ప్రణవి, లక్ష్మీ, శిరీష మహిళలు పాల్గొన్నారు.

## రావణ దహనానికి తరలిరండి

### జడ్చర్ల ప్రజానీకానికి ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆహ్వానం

**జడ్చర్ల, అక్టోబరు1, ప్రభాతవార్త:** దసరా పండుగ పురస్కరించుకొని జడ్చర్ల డిగ్రీ కళాశాల మైదానంలో వైభవంగా నిర్వహించనున్న రావణ దహన కార్యక్రమానికి అందరూ కుటుంబ సభ్యులతో కలిసిరావాలని జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి ఆహ్వానించారు. గురువారం దసరా పండుగ సందర్భంగా బుధవారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ.. మునుపెన్నడు జరగనంత శోభాయమానంగా ఈసారి జడ్చర్ల ప్రజలు దసరా పండుగను జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ, పట్టణ మొత్తాన్ని నవరాత్రి తొలి రోజు నుంచే తన సొంత ఖర్చులతో విద్యుత్ దీపాలంకరణ చేయించిన విషయాన్ని ప్రస్తావించారు. గురువారం సాయంత్రం జరిగే రావణ దహనం కార్యక్రమం బానసంచాలతో అందరిని ఆకట్టుకుంటుందని అభిప్రాయపడ్డారు.



మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి మాతృమూర్తి చర్లకోల లక్ష్మమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

## ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

### ●వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



దుర్గాదేవి పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**ఖిల్లాగణపురం అక్టోబర్1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పలు గ్రామాలలో దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలలో వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి బుధవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు దైవ భక్తిలో పాల్గొని ప్రజలను చైతన్యవంతులను చేయాలని గ్రామాలలో ప్రజలు భక్తి మార్గంలో నడిచే విధంగా కృషి చేయాలని చెప్పారు. అంతకుముందు ఎమ్మెల్యే మేఘారెడ్డి మండల కేంద్రంలోని కురువగేరులో శివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వెంకటాంపల్లి పర్వతాపూర్ మామిడిమడ గ్రామాలలో అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొని భక్తులు ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాను ఆయన వెంట కాంగ్రెస్ మండల పార్టీ నాయకులు వెంకటేశ్వరరావు, విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ గ్రామవెంకటయ్య, మురళీధర్‌రెడ్డి, రాజు, ఆకారం ప్రకాష్, మునగాల బాబు, శ్యాంసుందర్, రాములు, నాయక్, రాజేందర్ ,జితేందర్ రెడ్డి, పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవం



**అలంపూర్ అక్టోబర్1, ప్రభాతవార్త:** మహానవమి సందర్భంగా అలంపూర్ బాలబ్రహ్మేశ్వర స్వామి జోగులాంబ, ఆలయ పరిధి లోనిఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో కళ్యాణ్ సోము అర్చకులు ఆలయ అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి అమ్మవారికి కళ్యాణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ. దీప్తి ఆలయ అధికారులు ఉన్నారు.

## అన్నదానంకు రూ.50,000 విరాళం



భక్తులకు అన్నదానం చేస్తున్న దాతలు

**ఆలంపూర్ అక్టోబర్1, ప్రభాతవార్త:** బాల బ్రహ్మేశ్వర స్వామి జోగులాంబ అమ్మవారి గ్రూప్ దేవస్థానంలో ప్రతిరోజు అన్నదాన నిర్వహిస్తున్న భక్తులకు రెండు రోజులపాటు అన్నదానం ఏర్పాటు చేయాలని గద్వాల సంస్థానం వారసులు శ్రీకృష్ణ రాంభూపాల్ ప్రసాద్ స్కీం భవనం నందు గల దేవస్థానం అన్నదాన సత్రం నందు ఆలయ ఈవో దీప్తికి రూ. 50 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. అలాగే శ్రీ జోగులాంబ అమ్మవారి ఆలయం వెనుక గల స్థలంలో గులాబీ పూల గార్డెన్ ఏర్పాటు చేస్తామని వారు ఆలయ ఈఓకు హామీ ఇచ్చారు.

## దుర్గామాత నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి



జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, అక్టోబరు 1 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలో దేవి నవరాత్రి వేడుకల అనంతరం చేసే దుర్గామాత నిమజ్జానికి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ను బుధవారం ఉత్సవ సమితి సభ్యులు కలిసి విన్నవించారు. నిమజ్జనం కోసం కొండారెడ్డి చెరువు వద్ద ఈ నెల 2,3,4 తేదీల్లో క్రేన్ సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే పట్టణంలో జరిగే నిమజ్జన శోభాయాత్రకు అనుకూలంగా రోడ్ల మరమ్మతు పనులు చేపట్టాలని విన్నవించారు. అందుకు అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవసమితి అధ్యక్షుడు భీంచందర్‌గౌడ్, కార్యదర్శి మిర్చి వెంకటయ్య, సభ్యులు రఘువీర్ యాదవ్, నందు నామాజీ, శివ కుమార్, టి.ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి

**నవాబుపేట, అక్టోబరు1 ప్రభాతవార్త:** యువత చెడు వ్యవసనాల బారిన పడకుండా క్రీడా రంగాల్లో రాణించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులుగురుకుంట అంతపురం రవీందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొల్లూరు గ్రామంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమంలో భాగంగా క్రీడాకారులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలు శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు ఈ స్పోర్ట్స్ టోర్నమెంట్లు ఎంతో ఉత్సాహం కలిగించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు మైసమ్మ ఆలయ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులు సంతోష్, చందర్ నాయక్ కాజా మైనుద్దీన్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## నవరాత్రుల్లో పాల్గొన్న వనపర్తి ఎమ్మెల్యే

**అలంపూర్ అక్టోబర్ 1,ప్రభాతవార్త :** దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 10వ రోజు అమ్మవారు జోగులాంబ దేవిగా భక్తులకు దర్శనం ఇవ్వడంతో వనపర్తి ఎమ్మెల్యే మెగారెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని స్వామివారి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకంటే ముందు వీరికి ఆలయ ఈవో దీప్తి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా స్వామివారాలయంలో అభిషేకం అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన పూజలు చేశారు. వీరికి ఆలయ ఈవో దీప్తి, అర్చకులు శాలువాతో సన్మానించి ఆలయాల విశిష్టతల గురించి అర్చకులు వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి ఆలయం పూజలో పాల్గొన్న వనపర్తి ఎమ్మెల్యే

## మహిషాసురమర్ధినిగా అమ్మవారు

**చిన్నశంకరంపేట, అక్టోబరు 1, ప్రభాతవార్త:**
శరన్నవరాత్రి ఉత్సవాల్లోభాగంగా మండలపరిధి కొర్విపల్లిలోని ఆలయంలో దుర్గాదేవి అమ్మవారు బుధవారం మహిషాసురమర్ధిని రూపంలో దర్శనమిచ్చారు. అంబాజీపేట, మడూర్, చిన్నశంకరంపేటలో మాలధరులైన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## మనూర్‌లో వాలీబాల్ టోర్నమెంట్


వాలీబాల్ టోర్నమెంట్‌కు సై అంటున్న క్రీడాకారులు

**మనూర్, అక్టోబరు 1, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన మనూర్‌లో సిద్దారెడ్డి యువ సైన్యం ఆధ్వర్యంలో బుధవారం వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం అయింది. గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని టిఎల్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు.సిద్దేశ్వర్ కొనియాడారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆటల్లో పోటీ పడాలని యు.సిద్దేశ్వర్, గంపల సిద్దారెడ్డి క్రీడాకారులకు సూచించారు. ప్రతి సంవత్సరం దసరా పర్వదినాల్లో వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తూ క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు కృషిచేస్తున్నట్లు గంపల సిద్దారెడ్డి పేర్కొన్నారు. క్రీడాపోటీల్లో ప్రతిభచాటిన క్రీడాకారులకు మొమెంటోలు, బహుమతులు అందచేస్తామన్నారు. కార్యక్రమంలో గంపల సిద్దారెడ్డి, డి.లింగం, శంకర్ జోషి, సంతోష్‌జోషి, నారాయణ, రాములు, విఠల్, సంగన్న, పీర్‌రెడ్డి, గణేష్, జ్ఞానేశ్వర్, విజయ, సంతోష్, సంజీవులు, పండరి, సురేష్, మహేష్, సిద్దారెడ్డి యువసేన బాధ్యులు పాల్గొన్నారు.

## రిటైర్ట్ వైస్‌చాన్స్‌లర్లకు సన్మానం


రిటైర్డ్ వైస్‌చాన్స్‌లర్లను సన్మానిస్తున్న దృశ్యం

**జహీరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:**
కర్ణాటకలోని బసవ కళ్యాణ్‌లో గత వారంరోజులుగా కొనసాగుతున్న కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతున్న శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ తిరుపతి రిటైర్డ్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ డాక్టర్ జయరాంరెడ్డి, హైద్రాబాద్ తెలుగు యూనివర్సిటీ రిటైర్డ్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తంగెడ కిషన్ రావులను పట్టణంలోని బసవమండపంలో లింగాయత్ సమాజ్ అధ్యక్షులు రాజశేఖర్‌శెట్కార్, కార్యదర్శి రేకుళ్గి సుభాష్‌లు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందచేశారు. కార్యక్రమంలో లింగాయత్ సమాజ్ బాధ్యులు సోమశేఖర్ పాటిల్, బసవరాజు మడపతి, బెండి శేఖర్, అశోక్‌కుమార్, బశెట్టి, కుంబార్ బస్వరాజ్, వీరయ్య మడపతి, భుజంగ్ బండప్ప తదితరులు పాల్గొన్నారు.

## మెడిసిన్‌లో సీటు సాధించిన సంజన

**–విద్యార్థిని సన్మానించిన కాంగ్రెస్‌నేత**


సంజనను సన్మానిస్తున్న కాంగ్రెస్‌నేత రాములుయాదవ్

**జహీరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని హుగ్గెల్లి గ్రామానికి చెందిన హైదరాబాద్ సంజన తన ప్రతిభతో సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మెడిసిన్ విద్యను అందుకునేందుకు అర్హత సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన హైదరాబాద్ లక్ష్మారెడ్డి మొదటిసంతానం సంజన జహీరాబాద్ పట్టణ శివారులోని హోతి(కె) గ్రామంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో 10వ తరగతి పూర్తిచేసిన సంజన ఇంటర్మీడియట్ హైద్రాబాద్‌లోని ఓ ప్రయివేట్ కళాశాలలో విద్యను అందుకుని 974 మార్కులు సాధించి నీట్ పరీక్షల్లో 478 ర్యాంకు సాధించి ఎంబిబిఎస్‌లో విద్యను అందుకునేందుకు అర్హత సాధించి అందరి మన్ననలు అందుకుంది. మెడిసిన్‌లో సీటు సాధించిన సంజనను కాంగ్రెస్ నాయకులు ఎంజి రాములుయాదవ్, కిషన్‌రాథోడ్, నరసింహారెడ్డి తదితరులు బుధవారం శాలువాతో సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు.

## మహిషాసురమర్ధినిగా వనదుర్గాదేవి


చండీహోమంలో పాల్గొన్న భక్తులు

**పాపన్నపేట, అక్టోబరు 1, ప్రభాతవార్త:**
తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గాభవానీ మాత సన్నిధిలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులోభాగంగా బుధవారం నవమిని పురస్కరించుకొని అమ్మవారిని ఎరుపురంగు వస్త్రాలతో మహిషాసురమర్ధినిగా అలంకరించారు. పెద్దయెత్తున మహిళలు దర్శించుకొని కుంకుమార్చనలో పాల్గొన్నారు.

**చండీహోమం...**
శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గోకుల్‌షెడ్‌లో చండీహోమం నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు మహిషాసురమర్ధిని అవతారంలోని వనదుర్గాదేవిని దర్శించుకొని చండీహోమంలో పాల్గొని తరించిపోయారు.

**నేడు రాజరాజేశ్వరీదేవిగా...**
శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పదకొండవ రోజైన గురువారం దశమిని పురస్కరించుకొని శ్రీరాజరాజేశ్వరీదేవిగా (పసుపురంగు వస్త్రాలతో) దర్శనమివ్వనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

## రాబోయే ఎన్నికల్లో బిజెపి అన్నిస్థానాల్లో పోటీచేస్తుంది

**–బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్‌గౌడ్**

**పాపన్నపేట, అక్టోబరు 1, ప్రభాతవార్త:**
స్థానికసంస్థల ఎన్నికలలో అన్నిస్థానాలలో బిజెపి అభ్యర్థులు పోటీలో ఉంటారని బిజెపి మెదక్‌జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం పాపన్నపేటమండల పరిధిలోని నార్సింగిలో రాబోయే ఎన్నికలను దృష్టిలోపెట్టుకొని కార్యాశాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం పార్టీ మండలశాఖ అధ్యక్షులు సంతోష్‌చారి అధ్యక్షతన కొనసాగింది. కార్యక్రమంలో మండలశాఖాధ్యక్షుడు సంతోష్‌చారి, జిల్లా ఉపాధ్యక్షులు రాజేందర్, బిజెవైఎం ఉపాధ్యక్షులు శ్రీరాం నరేష్, మాజీసర్పంచ్ ఇమ్మానియేల్ ప్రధానకార్యదర్శులు నాగభూషణం, లక్ష్మణరావు, బొక్కల భాగేష్, మల్లేశం, సీతానగర్ మల్లేశం, పెంటయ్య, వెంకట్ బాచారం వెంకట్, వడ్లభాగేష్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**


ప్రజలకు జాగ్రతలు వివరిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నాగల్‌గిద్ద, అక్టోబరు 1, ప్రభాతవార్త:**
మంజీరా పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సూచించారు. మండల పరిధిలోని గౌడగం జన్వాడ గ్రామ ప్రజలు మంజీర బ్యాక్ వాటర్‌తో అవస్థలు పడ్డారని తెలుసున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి అర్థరాత్రి గ్రామానికి ట్రాక్టర్‌పై చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని, అందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామానికి చెందిన వ్యక్తికి సమస్య ఎదురైతే గ్రామస్థులందరు కలిసికట్టుగా సహకరించాలని సూచించారు. వరద ప్రవాహానికి గురైతే వెంటనే 101 టోల్‌ఫ్రీ నంబర్‌కు, లేదా తనకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు మండల యూత్‌కాంగ్రెస్ అధ్యక్షులు సచిన్‌పాటిల్, మాజీసర్పంచ్ అనిల్‌పాటిల్, నాయకులు సంతోష్, హన్మంతు తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి గ్రామానికి చేరుకుని గ్రామస్థులకు పలు సూచనలు చేశారు.

## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

**–జిహెచ్ఎంసి కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి**



వినతిపత్రం అందచేస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, అక్టోబరు 1, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఆయా కాలనీల్లో అభివృద్ధి పనులు నిర్వహించేందుకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్ జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వి కర్ణన్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని శ్రీసాయినగర్ కాలనీ థీమ్‌పార్క్‌లో టాయిలెట్స్, కమ్యూనిటీ హాల్‌కు రూ.25లక్షలు, కాకతీయనగర్ కాలనీలో సిసిరోడ్డుకు రూ.44లక్షలు, మయూరినగర్‌లో రోడ్డు నంబర్ 1,2లో సిసిరోడ్లకు రూ.30,20లక్షలు, అశోక్‌నగర్ వినాయక ఆలయం చుట్టుపక్కల సిసిరోడ్ గురించి రూ.34 లక్షలు (మొత్తం రూ.1.33కోట్లు) మంజూరు చేయాలని కమిషనర్‌కు వినతి పత్రం అందచేశామన్నారు. వినతిపత్రానికి కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామి ఇచ్చారన్నారు.

## మాంసవిక్రయాలు చేపడితే కఠినచర్యలు

**–మున్సిపల్ అధికారుల నోటీసులు**


మాంసం విక్రయదారులకు నోటీసులు అందచేస్తున్న దృశ్యం

**జోగిపేట, అక్టోబరు 1, ప్రభాతవార్త:**
ఈనెల 2న గాంధీజయంతి ఉన్నందున ఎవరూకూడా మాంసం విక్రయాలు చేపట్టకూడదని అందోలు–జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ అధికారులు నోటీసులు జారీచేశారు. ఈమేరకు శానిటరీ ఇన్స్‌పెక్టర్ వినయ్ మాంసం విక్రయదారులకు కమిషనర్ ఆదేశాలతోకూడిన నోటీసులు అందచేశారు. చికెన్, మటన్, చేపల విక్రయదారులతోపాటు ఎవరూకూడా జీవహింసకు పాల్పడకూడదని హెచ్చరించారు. ఒకవేళ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టరీత్యా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మల్లన్నసన్నిధిలో నవరాత్రిరాత్రోత్సవాలు


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, అక్టోబరు 1, ప్రభాతవార్త:**
శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడోరోజు గణపతిపూజతో ప్రారంభించి మంటప దేవత ఆరాధన, అమ్మవారికి విశేషంగా చతుష్షష్ట్యుపచార మహాపూజ, మహాపూర్ణాహుతి, అమ్మవారికి విశేషద్రవ్య సమర్పణ తదితర ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఎఈవో బుద్ది శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌కుమార్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి భారతీయుడు దేశభక్తి కలిగి ఉండాలి


ఆర్ఎస్ఎస్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**పాపన్నపేట, అక్టోబరు 1, ప్రభాతవార్త:**
ప్రతి భారతీయుడు దేశభక్తి కలిగి ఉండాలని ఆర్ఎస్ఎస్ మెదక్ జిల్లా బౌద్ధిక్ ప్రముఖ తోట రవి పేర్కొన్నారు, మండల పరిధిలోని నాగసానిపల్లి గ్రామంలో బుధవారం ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు, ఆర్ఎస్ఎస్ క్రమశిక్షణకు మారుపేరు అని, ఆర్ఎస్ఎస్ ఏర్పాటై 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇందులో భాగంగా నాగసానిపల్లిలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తల ఆధ్వర్యంలో భారీర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఖండవ్యవస్థ ప్రముఖ బోలా శేఖర్ జిల్లా గ్రామీణ వికాస్ ప్రముఖ అంతమ్మగారి కృష్ణారెడ్డి, గ్రామశాఖ ముఖ్యశిక్షక్ పైతర దుర్గాప్రసాద్ ధ్వజ ప్రముఖ పొలబోయిన అజయ్ ఇతర స్వయంసేవకులు గ్రామ యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేకపూజలు


పెద్దమ్మతల్లిని దర్శించుకున్నవారిని శాలువాలతో సన్మానించిన దృశ్యం

**జోగిపేట, అక్టోబరు 1, ప్రభాతవార్త:**
దేవీనవరాత్రుల్లో భాగంగా మండల పరిధిలోని మాసానిపల్లికి చెందిన పెద్దమ్మతల్లి ఆలయాన్ని మాజీ శాసనసభ్యులు చంటి క్రాంతికిరన్, ఐఎఎస్ వి.నాగిరెడ్డి, ఉమ్మడి మెదక్‌జిల్లా డిసిసిబి వైస్‌ఛైర్మెన్ పట్నం మాణిక్యంలు బుధవవారం దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయకమిటీ ఛైర్మన్ పి.నారాయణ వారిని శాలువాలతో సన్మానించారు.

## అప్పుల రాష్ట్రాన్ని అభివృద్ధిలో నడిపిస్తున్న సిఎం

**–కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు**


విలేకరులతో మాట్లాడుతున్న పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు అత్తు

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 1, ప్రభాతవార్త:**
పదేళ్లపాటు రాష్ట్రాన్ని పరిపాలించి దోచుకతిన్న బిఆర్ఎస్ ప్రజలకు బాకీపడిందని కాంగ్రెస్‌పార్టీ పట్టణాధ్యక్షుడు ఎండి.ఇమామ్(అత్తు) అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్నంతకాలం ప్రజలకు ఇచ్చినహామీలను అమలు చేయకుండా మోసంచేసిన బిఆర్ఎస్ ప్రజలకు బాకీపడిందన్నారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉనికి కాపాడుకునేందుకు ప్రయత్నం చేస్తుందని చెప్పారు. అప్పుల రాష్ట్రాన్ని సిఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధిచేసి చూపిస్తున్నారని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు మధు, గయాజుద్దీన్, అర్షద్‌హుస్సేన్, బాబా, ఫరీద్ నజ్జు, ఫయాజ్ తదతరులు పాల్గొన్నారు.

# న్యాల్‌కల్‌లో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు

**-గ్రామంలో ఆకట్టుకున్న పథసంచాలన్**


న్యాల్‌కల్ శ్రీకృష్ణ కన్వెన్షన్‌లో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల దృశ్యం

**న్యాల్‌కల్, అక్టోబరు 1, ప్రభాతవార్త:**
రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీకృష్ణ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రార్థన గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించి గణవేషలో ఉన్న స్వయం సేవకులు గ్రామంలోని పురవీధుల గుండా పథసంచాలన్ నిర్వహించారు. గ్రామంలో నిర్వహించిన పథసంచాలన్ చూపరులను ఆకట్టుకుంది. కుల, ప్రాంత, బేధాలు లేకుండా అందరం భరతమాత బిడ్డలం అని ఆర్ఎస్ఎస్ చాటి చెప్పిందని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమ పీఠాధిపత దేవగిరి మహారాజ్, ఆర్ఎస్ఎస్ న్యాల్‌కల్ కార్యవాహ బోరంచ నవీన్, శ్రీశైలం, మున్నూర్ అశోక్‌లతో పాటు ఆయా గ్రామాల స్వయం సేవకులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలి

**–టేక్మాల్ ఎయస్ఐ క్రిష్ణ**


సైబర్‌నేరాల పట్ల అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**టేక్మాల్, అక్టోబరు 1, ప్రభాతవార్త:**
సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని టేక్మాల్ ఎయస్ఐ క్రిష్ణ ప్రజలకు సూచించారు. బుధవారం టేక్మాల్ చౌరస్తాలో సైబర్ నేరాలపై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సైబర్ క్రైమ్ విపరీతంగా పెరిగిందని, పిల్లలపై వీటిప్రభావం ఎక్కువగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు అప్రమత్తతతో ఉండాలన్నారు. సైబర్ మోసానికి గురైన బాధితులు 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సంప్రతించి ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు. సైబర్‌నేరాల పట్ల అవగాహన ఉంటేనే వాటి నుంచి తప్పించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ దేవదాస్, సిబ్బంది క్రిష్ణ, చిరంజీవి, రవీందర్, రాజేందర్ తదితరులున్నారు.

## అంబరాన్ని అంటిన బతుకమ్మ సంబురాలు

**–బతుకమ్మలకు పూలు కరువు**
**–మినీ ట్యాంక్‌బండ్‌లో వైభవంగా బతుకమ్మ నిమజ్జనం**


బతుకమ్మ ఆడుతున్న మహిళల దృశ్యం

**కౌడిపల్లి, అక్టోబరు 1, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన కౌడిపల్లి గ్రామంతో పాటు ఆయా గ్రామాలల్లో బుధవారం సద్దులబతుకమ్మ పండుగ సంబురాలు అంబరాన్ని అంటినాయి. మినీ ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనం చేయడానికి పెద్ద ఊరేగింపుగా సద్దుల బతుకమ్మలు తరలివెళ్లినాయి. మహిళలంతా సద్దుల బతుకమ్మలను ఘనంగా నిమజ్జనంచేశారు. బతుకమ్మల నిమజ్జనం కోసం మినీ ట్యాంక్‌బండ్ వద్ద ఘాట్లు ఏర్పాట్లుచేసి, చెరువువద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గ్రామపంచాయతీ కార్యదర్శి, కారోబార్ యేల్లం, స్థానిక పోలీస్ సిబ్బంది తగుచర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో వ్యాపారస్థులు, రాజకీయ నాయకులు, గ్రామస్థులు, మహిళలు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు


గజగట్లపల్లిలో బతుకమ్మలను తీసుకెళ్తున్న మహిళలు

**చిన్నశంకరంపేట, అక్టోబరు 1, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని గవ్వలపల్లి, గజగట్లపల్లి తదితర గ్రామాలలో బుధవారం సద్దులబతుకమ్మ వేడుకలను మహిళలు వైభవంగా జరుపుకున్నారు. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలైన బతుకమ్మ సంబరాలు సద్దులబతుకమ్మతో ముగిశాయి. బతుకమ్మలను మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో చెరువుల్లో నిమజ్జనం చేశారు.

## హద్నూర్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ


సద్దుల బతుకమ్మ వేడుకలు జరుపుకుంటున్న మహిళలు

**న్యాల్‌కల్, అక్టోబరు 1, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని హద్నూర్ గ్రామంలో బుధవారం సద్దుల బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. సాయంత్రం గ్రామశివారులోని చెరువులలో బతుకమ్మలను నిమజ్జనంచేశారు.

## మహిషాసురమర్ధినిగా శ్రీవిద్యాధరి

**–ప్రత్యేక పూజలు చేసిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ దంపతులు**


ఆలయంలో హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

**వర్గల్, అక్టోబరు 1, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన వర్గల్‌లోని శ్రీవిద్యాసరస్వతి క్షేత్రంలో శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు మహిషాసురమర్ధిని అవతారంలో భక్తులకు దివ్యదర్శనం ఇచ్చారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో అష్టోత్తర శతకలశాభిషేకం ఘనంగా నిర్వహించగా, వేదవిద్యార్థులు, ఆలయపండితులు, దీక్షాధారులు, భక్తులనృత్యాలు కనువిందుచేశాయి. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య గణపతిపూజ, స్వస్తి పుణ్యాహవచనము, 108 కలశప్రతిష్ఠ, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం సిద్ధాంతి చంద్రశేఖరశర్మ నేతృత్వంలో అమ్మవారికి మహాకలశాభిషేకం చేశారు. కాగా, సాయంత్రం కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ దంపతులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. ఈసందర్భంగా వారిని అమ్మవారిశేషవస్త్రంతో సత్కరించారు.

## గుండెపోటుతో దేవాదాయశాఖ స్వీపర్ మృతి

**పాపన్నపేట, అక్టోబరు 1, ప్రభాతవార్త:**
దేవాదాయ ధర్మాదాయశాఖలో సక్రమంగా విధులు నిర్వర్తించి ఇంటికి వెళ్ళిన ఓచిరుద్యోగి గుండెపోటుతో మృతిచెందడంతో ఆలయ అధికారులు దిగ్భ్రాంతిచెందారు. స్వీపర్ నర్సింలు అకాలమృతి పలువురిని కలచివేసింది. ఈవిషయం తెలుసుకున్న ఆలయ అధికారులు వెంటనే ఆయన కుటుంబానికి ప్రగాఢసానుభూతి తెలిపి అంత్యక్రియల నిమిత్తం రూ.30వేల ఆర్థికసహాయం అందజేశారు.